క్లుప్తంగా

సింహవాహనంపై పాండురంగడు



కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూ దేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం స్వామివారు సింహవాహనంపై భక్తులకు కనువిందు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు స్వామివారికి పంచామృతాభిషేకం, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు,గణపతిపూజ, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.రాత్రికి ప్రత్యేక అలంకరణలో పాండురంగడు సింహవాహనంపై దర్శనమివ్వడంతో భక్తులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీ సెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు శేషవాహనంపై దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



ఉదయ్



తేజ

కొలిమిగుండ్ల: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉదయ్, తేజ జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్‌ఎం సోమశేఖర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 2వ తేదీన నెల్లూరు జిల్లా వింజమూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ త్రోబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. వీరు ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో జరుగనున్న జూనియర్ జాతీయస్థాయి త్రోబాల్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులతో పాటు పీడీ షేక్షావలిని అభినందించారు.

ఫంక్షన్ హాల్ నిర్మాణానికి చర్యలు

కొలిమిగుండ్ల:స్థానిక కస్తూర్బా పాఠశాల సమీపంలో ప్రధాన రహదారి చెంతనే ఫంక్షన్ హాల్ నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయి. రామ్‌కో సిమెంట్‌కంపెనీ రూ.2 కోట్ల సీఎస్‌ఆర్ నిధులతో మండల ప్రజల సౌకర్యార్థం ఇక్కడ ఫంక్షన్ హాల్ నిర్మించనున్నారు.ఈ మేరకు శుక్రవారం జేసీబీ సాయంతో కంప చెట్లు తొలగిస్తున్నారు. త్వరలోనే భూమిపూజ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ఇటిక్యాల రెవిన్యూ పరిధిలోని జాతీయ రహదారి చెంతనే 765/6 సర్వే నెంబర్‌లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం కేటాయించేందుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ దృష్టికి తీసుకెళ్లి భూమిని కేటాయించేలా కృషి చేశారు.

వన్యప్రాణుల రక్షణకు చర్యలు

డోన్ టౌన్: వన్యప్రాణులు రోడ్డు దాటుతూ మృత్యువాత పడుతుండటంతో వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు డోన్ అటవీశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఓబులాపురం మిట్ట వద్ద, కొండ కాంద, దొరపల్లె, ఉడుములపాడు గ్రామాల సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం నాలుగు సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని, వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలన్నారు. ఫారెస్ట్ డీఆర్‌ఓ రమణారెడ్డి, బీట్ ఆఫీసర్ భారతి, ఏబీఓ వీరకుమార్ తదితరులు ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం

బేతంచెర్ల: మండలపరిధిలోని యంబాయి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయని బాధిత రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన పరమేశ్వరప్ప, బసవరాజు అనే రైతులు పశువుల కోసం కల్లంలో గడ్డి వాములు వేసుకున్నారు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివాములు కాలిబూడిదయ్యాయని, రూ.1.30 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతులు వాపోయారు.

నేడు డయల్ యువర్ డీఎం

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు డీఎం తిరుపతయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..డిపో పరిధిలోని ఆయా రూట్లలో నడిచే బస్ సర్వీసులకు సంబంధించి సమస్యలు, సలహాలు, సూచనలు అందజేయాలని సూచించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 25798 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ప్యాపిలి: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓఆర్డీ బాలకృష్ణుడు, హౌసింగ్ ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బసవన్నల రాజసం.. రైతన్నల ఉత్సాహం

- గ్రామాల్లో హోరాహోరీగా బండలాగుడు పోటీలు
- గెలుపొందిన వృషభాల యజమానులకు రూ.వేలల్లో బహుమతులు
- ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు





మద్దిలేటి స్వామి ఉత్సవాల సందర్భంగా బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, ఆలయ ఈఓ, చైర్మన్ (ఫైల్), రాతిదూలాన్ని లాగుతున్న వృషభాలు

బేతంచెర్ల: జిల్లాలోని ప్రముఖ శైవ, వైష్ణవ పుణ్యక్షేత్రాల్లో ఆయా పండుగలు, తిరునాళ్లు జరిగేటప్పుడు ఉత్సవాలకు హాజరైన వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపాలనే ఉద్దేశంతో నిర్వాహకులు వృషభ రాజములకు బండలాగుడు పోటీలను నిర్వహించేవారు. ప్రస్తుతం పుణ్యక్షేత్రాలతోపాటు ఆ సంస్కృతి మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. మండలంలో వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ముక్కోటి ఏకాదశి ఉత్సవా లను పురస్కరించుకొని ఏటా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అదే క్రమంలో పట్టణంలోని చౌడేశ్వరీ దేవి, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గ్రామంలోని పారిశ్రామిక వేత్తలు, రైతు సంఘం నాయకుల సహకారంతో రాష్ట్రస్థాయి బండలాగుడు,జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నారు.

మండలపరిధిలోని ఆర్‌యస్ రంగాపురం, రహిమానుపురం, హెచ్.కొట్టాల, ముద్దవరం, ఆర్.బుక్కాపురం గ్రామాలో జిల్లా స్థాయి బండలాగుడు, కబడ్డీ పోటీలను నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉత్సహం నింపుతున్నారు. ఒక దశలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.20 వేల నుంచి రూ.30 వేలకు మించేవికావు. ప్రస్తుతం దాతల సహకారంతో ప్రథమ బహుమతి రూ.50 వేలు,ద్వితీయ రూ. 40 వేలు,తృతీయ రూ. 30వేల దాక వృషభరాజముల యజమానులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని ముద్దవరం, రహిమానుపురం, హుశేనాపురం, శంకలాపురం, ఆర్ బుక్కాపురం గ్రామాలో కొంతమంది రైతులు బండలాగుడు పోటీలకు వృషభ రాజములకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే యువత కబడ్డీ పోటీలపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలోని ఆర్‌బుక్కాపురం, నాగమళ్లకుంట, ఆర్‌యస్ రంగాపురం,సిమెంట్‌నగర్, శంకలాపురం, యంబాయి గ్రామాల్లో రెండు మూడు జట్ల కబడ్డీ ఆటగాళ్లు ఉన్నారంటే కబడ్డీ, బండలాగుడు పోటీలు గ్రామాల్లో కొత్త ఉత్సహాన్ని నింపుతున్నాయని చెప్పవచ్చు.

11న బండలాగుడు పోటీలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ నుంచి ఉమ్మడి రాష్ట్రాల ఎడ్లబల ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శుక్రవారం వారు మాట్లాడుతూ..11న పాలపండ్ల వృషభాల విభాగంలో నిర్వహించే రాతిదూలం లాగుడు పోటీల్లో విజేతలకు(మొదటిఐదుస్థానాలకు)వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ. 20 వేలు, రూ.10వేలు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అలాగే 13వ తేదీన న్యూ కేటగిరీ విభాగంలో జరిపే ఎడ్ల బలప్రదర్శనలో విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.80వేలు,రూ.60 వేలు,రూ.40వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల వృషభాల యజమానులు ఈ నెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 99893 76207 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలన్నారు.

వారం రోజుల పాటు ఉత్సవాలు



పారిశ్రామిక కేంద్రమైన బేతంచెర్లలో చెన్నకేశవ స్వామి, చౌడేశ్వరీ దేవి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఆయా సందర్భంలో గ్రామానికి వచ్చిన బంధువులకు కొత్త ఉత్సహాని నింపాలనే సదుద్దేశంతో పారిశ్రామిక వేత్తలు, రైతు సంఘం నాయకుల తోడ్పాటుతో రైతు సంబరాలు నిర్వహిస్తున్నాం. తగిన నిబంధనలతో వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నాం.

– ఇవి సుజాత శర్మ, చెన్నకేశవ స్వామి ఆలయ మాజీ చైర్మన్, బేతంచెర్ల


గ్రామంలో సందడే సందడి



బేతంచెర్ల గ్రామంలో జరిగే చౌడేశ్వరీ దేవి ఉత్సవాలు, చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకత ఉంది. రెండు సందర్భాల్లో నిర్వహించే బండలాగుడు, పోటీలకు ఆయా ప్రాంతాల నుంచి వృషభాలు హాజరవుతుంటాయి. దీంతో గ్రామంలో వారం రోజుల పాటు సందడి వాతావరణం నెలకొంటుంది.

– బుగ్గన శ్రీధర్ రెడ్డి, చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ సభ్యులు

రైతుల్లో కొత్త ఉత్సాహం కలుగుతుంది



గ్రామీణ ప్రాంతాల్లో మొదలుకొని మండల కేంద్రాలు,ముఖ్యంగా బేతంచెర్లలో ఉత్సవాల సందర్భంగా నిర్వహించే బండలాగుడు పోటీ లు రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయి. తిరునాలలో నిర్వహించే పోటీలను చూసేందుకు పెద్ద ఎత్తున రైతులు తరలివస్తుంటారు. ఏటా శ్రీరామనవమి పురస్కరించుకొని సంజీవనగర్‌లో కబడ్డీ, గుండు, చంద ఎత్తే పందేలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నాం.

– గూని నాగరాజు, బేతంచెర్ల

వేంకటేశ్వరునికి పుష్పార్చన



పూజలందుకుంటున్న గోదాదేవి శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామి

డోన్:స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర వైశాఖ పౌర్ణమి పురస్కరించుకొని గోదాదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వర స్వామికి శుక్రవారం భక్తులు లక్ష మల్లెపూలతో అర్చన నిర్వహించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో మహిళలు నారాయణ పఠనం గావించారు.గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. వందలాది మంది భక్తులు లక్ష మల్లెపూల అర్చనకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌శర్మ, రాముశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

గ్రామ సచివాలయం తనిఖీ

డోన్: సచివాలయ ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు రేగటి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఆయన శుక్రవారం రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములుతో కలిసి కొత్తకోట గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ.. వ్యవసాయ సీజన్‌లో సచివాలయ ఉద్యోగులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, వ్యవసాయ సలహామండలి చైర్మన్ చంద్రన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దానధర్మాలకు వెచ్చించాలని ప్రకృతి పీఠం అధ్యక్షుడు, రిటైర్డ్ లైబ్రేరియన్ పల్లె నరసింహారెడ్డి సూచించారు. అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రతి నెలా అందజేసే పింఛన్ల ప్రక్రియను శుక్రవారం స్థానిక పరంధామ నిలయంలో చేపట్టారు. పట్టణానికి చెందిన 150 మందికి రూ.100 చొప్పున పింఛన్ అందించారు. దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

చౌడేశ్వరీదేవికి పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవికి పల్లకిసేవ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి రామానుజన్, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. సాయంత్రం పల్లకి సేవ, సహస్రదీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించి, అమ్మ వారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. దాడుల్లో గ్రామానికి చెందిన మోకాశీ భాగ్యమ్మ అనే మహిళ నుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బైకుల్లో బ్యాటరీలు చోరీ

ప్యాపిలి: ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన బైకుల నుంచి బ్యాటరీలు, పెట్రోల్ చోరీకి గురవుతుండటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని గ్రంథాలయం వద్ద నివాసం ఉంటున్న మాలిక్ తన ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశాడు. శుక్రవారం ఉదయం చూడగా బైక్‌లోని బ్యాటరీతో పాటు పెట్రోల్ కూడా చోరీకి గురైంది. గతంలో కూడా ఇలాగే జరిగిందని బాధితుడు వాపోయాడు. ఈ విషయమై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైభవంగా చెన్నకేశవ స్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న మహిళలు

బేతంచెర్ల: మండలపరిధిలోని యంబాయి గ్రామంలో వెలసిన చెన్న కేశవస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా వేదపండితులు దివాకర్ శర్మ, పవనయ్య శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూ, మంగళవాయిద్యాలు, నామస్మరణల మధ్య స్వామివారి కల్యాణం జరిపారు. అలాగే టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో సామూహిక గోపూజ నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి, భక్తులు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో వైశాఖ మాసం పౌర్ణమి పురస్కరించుకొని శుక్రవారం ఉదయం భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమంలో వెలసిన రమాదేవి సమేత సత్యనారాయణ స్వామికి అర్చకుడు ప్రభాకర్‌శర్మ శాస్త్రోక్తంగా మంత్రాలు చదువుతూ అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి నిర్వహించారు. వ్రతం మహత్యాన్ని వివరించారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆశ్రమ నిర్వాహకులు ఈశ్వర్ ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ నివేదికలపై సమీక్ష



నివేదికపై సిబ్బందితో సమీక్షిస్తున్న డ్వామా డోన్ డివిజన్ క్లస్టర్ ఏపీడీ శ్రీవిద్య

బనగానపల్లెరూరల్: గతంలో 2007 నుంచి 2022 వరకు డోన్ డివిజన్ క్లస్టర్‌లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ నివేదికలపై డోన్ క్లస్టర్ డ్వామా ఏపీడీ శ్రీవిద్య, సామాజిక తనిఖీ జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ పక్కీరప్ప ఆధ్వర్యంలో సమీక్ష శుక్రవారం స్థానిక పాదుపు భవనంలో జరిగింది. సమీక్షలో గతంలో సామాజిక తనిఖీ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభ సమావేశాల్లో బయటపడిన పలు అవినీతి ఆరోపణలకు సంబంధించి అధికారులు ఏపీఓ, ఈసీ, టీఏ, ఎఫ్‌ఏలపై విధించిన రికవరీతో పాటు నోటీసులు తదితర అంశాలను సంబంధించి మరోసారి రివ్యూ చేశారు. అభియోగాలపై వీలైనంత త్వరగా సమాధానం ఇచ్చి, క్లియరెన్స్ చేసుకోవాలని వారు సూచించారు. డోన్ క్లస్టర్ పరిధిలోని మండలాల ఏపీఓలు, ఈసీలు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ భర్త మృతి



మృతుడు సుధాకర్ (ఫైల్)

డోన్ టౌన్: డోన్ మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు సుభద్ర భర్త సుధాకర్ (36) శుక్రవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. పట్టణంలో సొంతింటి నిర్మాణ పనులను పరిశీలిస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో అక్కడున్న వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే సుధాకర్ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. సుధాకర్ ఎద్దుపెంట ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య సుభద్ర దొరపల్లె ఎంపీటీసీగా ఎన్నికై మండల ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. సుధాకర్ మృతి పట్ల ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, గ్రామ వైయస్సార్‌సీపీ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

గాయపడిన మహిళ మృతి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో గాయపడిన మహిళ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎస్‌ఐ అందించిన సమాచారం మేరకు.. అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన సుభానీ తన భార్య చిన్న దస్తగిరమ్మ ఇద్దరు పిల్లలతో బైక్‌పై కోవెలకుంట్ల మండలం రేవనూరు ఉసేన్‌స్వామి దర్గాకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా పట్టణ శివారులోని రైల్వే వంతెన సమీపంలో బైక్ వెనుక కూర్చున్న చిన్న దస్తగిరమ్మ జారి కింద పడి గాయాలపాలైంది. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో సిబ్బంది ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాత పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

గడప గడపకూ సంక్షేమం



లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



రైతులకు సబ్సిడీపై మంజూరైన ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే

అవుకు: వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మద్రికుంట తండా, ఇస్రానాయక్ తండా, మన్నేనాయక్ తండా గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రజా సంక్షేమ ప్రభుత్వమని, ప్రతి పేదవాడు ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలుచేస్తోందన్నారు. అలాగే ఇంటింటి వద్ద సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మద్రికుంట తండాలో సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు తెలపటంతో త్వరలోనే సీసీ రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో సేవాలాల్ దేవాలయం నిర్మించాలని కోరడంతో ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

రైతులకు ట్రాక్టర్, వ్యసాయ పనిముట్ల పంపిణీ
ఇస్రానాయక్ తండాలోని శ్రీ కంబగిరి స్వామి రైతు మిత్ర గ్రూపునకు సబ్సిడీపై మంజూరైన ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పంపిణీ చేశారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఒక సీహెచ్‌సీ గ్రూపు ఏర్పాటు చేసి సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రూపునకు ట్రాక్టర్, ట్రాలీ, రోటావేటర్, గొర్రు, ఏడు చెక్కల నాగలి, గుంటక, కేజీవీల్స్, స్ప్రేయర్ అందిస్తున్నట్లు వివరించారు. ఎంపీడీఓ అజాంఖాన్, ఏఓ ప్రసాద్ రావు, డాక్టర్ భారతీదేవి, ఈఓఆర్‌డీ రామకృష్ణవేణి, సర్పంచ్ దేవిభాయి, వైఎస్సార్‌సీపీ నాయకులు పురుషోత్తం నాయుడు, లక్మానాయక్, రాముడు నాయక్, కంబగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.

30 మందికి కల్యాణ కానుక

డోన్ టౌన్: పేద ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగు లు, భవన నిర్మాణ కార్మికులు కుటుంబాల్లోని ఆడ పిల్లల వివాహానికి ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం శుక్రవారం విడుదలైంది. మండలంలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాది తోఫా పథకంలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన 30 మందికి లబ్ధి చేకూరిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. 2023 జనవరి నుంచి మార్చి వరకు డోన్ మండలంలో 31 మంది దరఖాస్తు చేసుకోగా సాంకేతిక కారణాల వల్ల ఒకరి దరఖాస్తు అప్‌లోడ్ కాలేదని మిగతా 30మంది యువతుల తల్లు ల ఖాతాలోనగదు జమ అయినట్లు ఆయన తెలిపారు.

కొనసాగుతున్న గాలింపు

సంజామల(కోవెలకుంట్ల):సంజామల మండలం కమ లపురి గ్రామ సమీపంలోని పాలేరు వాగులో గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు కొనసాగుతోంది. మండలంలోని హోత్రమాన్‌దిన్నెకు చెందిన కంబగిరి అనేవృద్ధు డు మూడురోజులక్రితం గల్లంతయ్యాడు.వాగు దాటుతుండగా నీటిప్రవాహంలో కొట్టుకుపోయాడు. పోలీసు బృందాలు గల్లంతైన వృద్ధుడికోసం వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

డోన్ టౌన్: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఆత్మకూరు ఏడీ ఆంజనేయులు, డోన్ మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుండటంతో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు ఎమ్మార్పీకే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలందించండి

కోవెలకుంట్ల: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జపురుల్లా సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సీహెచ్‌సీ పరిధిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, వసతులు, తదితర విరాలను ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు శ్వేతశాలిని, అభినయ్‌రెడ్డి, వెంకటలక్ష్మి, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

ఆళ్లగడ్డ: పట్టణ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న, వాటికి బానిసలైన యువకులను శుక్రవారం రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, రూరల్ ఎస్‌ఐ నరసింహులు అరెస్టు చేయగా డీఎస్పీ వెంకటరామయ్య కేసు వివరాలను విలేకరులకు వివరించారు. పెద్దకందుకూరు గ్రామ సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద తనిఖీలు చేపట్టి రామలక్ష్మి కొట్టాలకు చెందిన మద్దిలేటి రెడ్డి, బాలుడు, సింగం వీధికి చెందిన రాఘవేంద్ర, దువ్వూరుకు చెందిన దస్తగిరి, చింతకుంటకు చెందిన హుసేన్‌వలి, బాల నరసింహుడు, మద్రిపల్లి రాముడు నుంచి 1,230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే కొండంపల్లి వద్ద మరికొందరి నుంచి 1,150 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


రేషన్ బియ్యం స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని విజయభాను కాటన్‌మిల్ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యాన్ని త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. కాటన్ మిల్ సమీపంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ఇంట్లో తనిఖీలు చేయగా 170 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించామని, బియ్యం స్వాధీనం చేసుకొని నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు.

నేడు మొబైల్ ఆధార్ క్యాంప్

కొలిమిగుండ్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం చింతలాయిపల్లె సచివాలయంలో మొబైల్ ఆధార్‌క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బ రాజు తెలిపారు. 0–5 ఏళ్ల పిల్లలకు ఆధార్ నమోదు చేస్తామన్నారు.ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉడుములపాడులో ఇసుక పంపిణీ కేంద్రం



ఇసుక పంపిణీ అనుమతి పత్రాలు అందిస్తున్న దృశ్యం

డోన్: జగనన్న కాలనీలో లబ్ధిదారులకు ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఉడుములపాడు హౌసింగ్ లేఅవుట్ నుంచి ఇసుక పంపిణీని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ మార్కెట్ యార్డు లబ్ధిదారులకు అందుబాటులో లేదనే ఫిర్యాదులు రావడంతో లబ్ధిదారుల సౌకర్యార్థం ఉడుములపాడు జగనన్న కాలనీలోనే ఇసుక పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఇప్పటికే ఆ కాలనీతో పాటు దొరపల్లె లేఅవుట్‌లో విద్యుత్, నీటి వసతి కల్పించామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికె హరికిషన్, జాకీర్ హుసేన్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, నాయకులు ఆర్ఈ రాజవర్ధన్, రైల్వే నాయుడు, హౌసింగ్ ఏఈ వీరేంద్ర పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల విరాళం

బేతంచెర్ల: సమాజంలోని అట్టడుగు వర్గాల వారి సేవా భావంతో తోడ్పాటు అందించి ఆదర్శ జీవనం గడపాలని మండల సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ కరీం పిలుపునిచ్చారు. శుక్రవారం కర్నూలు రహదారిలోని మిస్బా వృద్ధాశ్రమానికి స్నేహితుడు హరి సహకారంతో రూ.16 వేల విలువచేసే నిత్యావసర సరుకులను అందజేశారు.